ఆపత్కాలంలో దూరంగా..



రాత్రయినా.. పగలైనా.. ఎండైనా...వానైనా ఎక్కడ ఎవరికి వైద్య సహాయం కావాలన్నా వెంటనే 108కు కాల్ చేస్తారు. అంబులెన్సు వచ్చి ఆస్పత్రికి తీసుకువెళుతుందనే ఆతృతతో ఎదురు చూస్తారు. గతంలో ప్రమాదంలో ఉన్నప్పుడు 108కు ఫోన్ చేస్తే క్షణాల్లో అంబులెన్స్ వచ్చేది. కానీ గత వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో 108 సేవలు ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయన్న విమర్శలు ఉన్నాయి. ఏదైనా ప్రమాదం జరిగినా, అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లాలన్నా బాధితులు ప్రైవేటు అంబులెన్సు, వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

- అత్యవసర పరిస్థితుల్లో అందుబాటులో ఉండని 108 అంబులెన్సులు
- కేవలం రిఫరల్ అంబులెన్సులుగా సేవలు
- ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్న రోగులు

ఏలూరు క్రైం, జూలై 14 : సత్యం కంప్యూటర్స్ అధినేత 2005, ఆగస్టు 15న తొలుత ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో 108 అంబులెన్సులను ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి దశలవారీగా అన్ని ప్రాంతాల్లో, అన్ని మండలాలకు ఒకటి చొప్పున ఏర్పాటు చేశారు. అప్పుడే పుట్టిన పసిబిడ్డలను సత్వరం ఇంక్యుబేటర్‌లో పెట్టడానికి, రిఫరల్ ఆస్పత్రులకు తీసుకెళ్లడానికి, నియోనటల్ బోర్నబేబీ అంబులెన్స్ ఒకటి నూజివీడులో ఉంచారు. జాతీయ , రాష్ట్రీయ రహదారిపై ఎక్కడ ఏ సమయంలో ప్రమాదం జరిగినా 108 అంబులెన్సులు సత్వరమే సహాయ చర్యలకు అందుబాటులోకి వచ్చేవి. కానీ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అంబులెన్సుల సేవలు ప్రజలకు అందుబాటులో లేకుండా తమ కార్యకర్తలకు సేవా అంబులెన్సులుగా మార్చేసు కున్నారు. జిల్లాలో మండలానికి ఒక అంబులెన్సు వంతున అంబులెన్సులను ఏర్పాటు చేశారు. ఆ మండలంలో ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే 108 అక్కడకు చేరుకుని ప్రాథమిక చికిత్స అందిస్తూ సమీప ఆస్పత్రికి తరలించే వారు. ఈ విధంగా సేవలందించే అంబు లెన్సులను ఏకంగా తమ కార్యకర్తలను ఒక ఆస్పత్రి నుంచి పై ఆస్పత్రికి రిఫర్ చేస్తే అందుకు కూడా వినియోగించడం మొదలు పెట్టారు. దీంతో ఆ మండలంలో ఉండాల్సిన అంబులెన్సు రిఫరల్ అంబులెన్సుగా మారిపోయింది. మండలంలో ఏదైనా ప్రమాదం జరిగినా, ఎవరికి అత్యవసరమైనా అందుబాటులో ఉండడం లేదు. ప్రస్తుతం ఇదే పరిస్థితి నెలకొని ఉంది.

ఏలూరు ప్రభుత్వాస్పత్రి నుంచి ప్రతి రోజు రాత్రి వేళ ఏడు అంబులెన్సులు విజయవాడకు రిఫరల్‌గా వెళ్తూనే ఉన్నాయి. పగలు కూడా ఇదే పరిస్థితి. పేరుకే మెడికల్ కాలేజీ ఆస్పత్రి. ఇక్కడ పడకలు లేవని, సంబంధిత వైద్యులు లేరని రిఫరల్ చేయడంతో ఏలూరు అంబులెన్స్‌తో పాటు పెదపాడు, ఉంగుటూరు, దెందులూరు, కామవరపు కోట, భీమడోలు, ద్వారకాతిరుమల అంబులెన్సులను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి రప్పించి ఇక్కడ ఉన్న పేషెంట్లను విజయవాడకు రిఫరల్ అంబులెన్స్‌గా వినియోగిస్తున్నారు. ఒక అంబులెన్సు విజయవాడ వెళ్ళి రావడానికి నాలుగున్నర గంటలు పడుతుంది. ఈ అంబులెన్సు ఎక్కడ నుంచి వచ్చిందో అక్కడకు వెళ్ళడానికి మరో గంట పడుతుంది. మొత్తం మీద ఐదున్నర గంటలు అంబులెన్సు ఆ మండలంలో అందుబాటులో లేకుండా పోతోంది. ఈ ఐదున్నర గంటల్లో ఆ మండలంలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఆటోలనో, ప్రైవేటు అంబులెన్సులను ఆశ్రయించాల్సిందే. ఏలూరు జిల్లాలో 130 మంది 108 సిబ్బంది విధులను నిర్వర్తిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకూ రెండు షిఫ్టులుగా ఒక్కొక్క షిఫ్టు 12 విధులను నిర్వర్తిస్తున్నారు. ఒక్కో వాహనం సగటున ఐదు కేసులకు హాజరవుతుంది. ప్రస్తుతం ఉన్న 108 అంబులెన్సులను 2020లో జూలై 1వ తేదీన ప్రవేశపెట్టారు. ఒక్కొక్క వాహనం మూడు లక్షల పైబడి కిలోమీటర్లు తిరిగినట్లు తెలుస్తుంది. దీంతో అవి డోర్లు ఊడిపోయి, అద్దాలు జారిపోయి శబ్దాలు చేసుకుంటూ నడుస్తున్నాయి. ఇటీవల కైకలూరు నుంచి ఏలూరు ఆశ్రంకు డయాలసిస్ పేషెంట్‌ను తీసుకొస్తున్న అంబులెన్సు బ్రేక్ ఫెయిల్ అవ్వడంతో జాతీయ రహదారి పైనే హోర్డింగ్ ఐరన్ పోల్‌ను ఢీ కొంది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. మిగిలిన వాహనాల కండీషన్ కూడా అంతంత మాత్రంగానే ఉంది.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

జిల్లాలో ఎక్కువగా రిఫరల్ కేసులకే అంబులెన్సులను వినియోగిస్తున్నారు. ఏలూరు నుంచి రాత్రి వేళ ఏడు కేసులు వరకు, పగటి వేళ ఏడు కేసులు వరకు ఏలూరు నుంచి విజయవాడ, గుంటూరులకు రిఫర్ తీసుకువెళ్తున్నాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం మండలానికి ఒకటి చొప్పున 27 అంబులెన్సులు ఉన్నాయి. వాహనాలకు ఎప్పటి కప్పుడు మరమ్మతులు చేయించి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

- దాసరి వెంకటేష్, మేనేజర్, 108

వైసీపీ నేతకు టీడీఆర్ ఉచ్చు





- సీబీ సీఐడీకి అప్పగించాలని కూటమి పట్టు
- ఒకే స్థలంపై కమిటీ దర్యాప్తు
- యజమానికి కాకుండా బిల్డర్‌కు బాండ్‌లు
- మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేయడమూ తప్పిదమే
- అధికారుల వెన్నులో వణుకు
- కూటమి నేతలతో సంప్రదింపులు
- రాజీకి యత్నాలు..బలైపోయామంటూ ఆవేదన

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెంలో టీడీఆర్ బాండ్‌ల జారీలో సిఫారసు చేసిన అధికారులు హాయిగా ఉన్నారు. లబ్ధిపొందన వైసీపీ నేత ఎదురుదాడి చేస్తున్నారు. బయటకు వెల్లడించిన కూటమి నేతలపై నిందలు మోపుతున్నారు.కోట్ల రూపాయలు కొల్లగొట్టి ఇప్పుడు తనకేమీ కాదన్న ధీమా ఒలకబోస్తున్నారు. తాడేపల్లిగూడెంలో రహదారుల విస్తరణ పేరుతో టీడీఆర్ బాండ్‌ల జారీపై సీబీసీఐడి దర్యాప్తు చేపట్టాలని కూటమి నేతలు పట్టుబడుతున్నారు. పట్టణంలో దాదాపు రూ.150 కోట్ల విలువైన బాండ్‌ల జారీలో వైసీపీ నేత భారీగా లబ్ధిపొందారు. ఆయన కనుసన్నల్లోనే బాండ్‌లు జారీ అయ్యాయి. స్థల యజమానులకు పెద్దగా ఒరిగిందేమీ లేదు. మాస్టర్ ప్లాన్ రహదారి వద్ద తమ స్థలానికి కొంతమేర ముట్టిందంటూ పలువురు స్థల యజమానులు గుంభనంగా ఉన్నారు. స్థల యజమానులకు మభ్యపెట్టి టీడీఆర్ బాండ్‌లు జారీ చేసిన ఉదంతం ఇప్పుడు అధికార వర్గాల్లో కాకపుట్టిస్తోంది. తాడేపల్లిగూడెంలోని తాళ్ల ముదునూరు పాడులో సుమారు 1400 గజాలకు టీడీఆర్ బాండ్‌లు జారీ విషయమై జిల్లా కలెక్టర్ దర్యాప్తునకు ఆదేశించారు. స్థల యజమానులకు అక్కడ ఎటువంటి లబ్ధి చేకూరలేదు. బిల్డర్‌తో పాటు, అధికార పార్టీ నేత కూడా మోసం చేశారు. మధ్యవర్తి కూడా పెద్ద మొత్తంలో లబ్ధిపొందారు. మహిళా ఐఏఎస్‌కు భారీ ముడు పులు అందాయి. వారంతా ఇప్పుడు దర్జా ఒలకబోస్తున్నారు. బాండ్‌లు జారీ చేసిన అధికారుల వెన్నులో మాత్రం వణుకు పుడుతోంది.

కొంపముంచిన ధీమా

మళ్లీ వైసీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందన్న ధీమాయే తాడేపల్లిగూడెం మున్సిపల్ అధికారుల కొంప ముంచింది. ఉన్నతాధికారులు సైతం సిఫారులకు వెనుకాడ లేదు. వైసీపీ నేత ఆగడాలకు అడ్డూ అదుపూలేకుండా పోయింది. కమిషనర్లు టీడీఆర్ బాండ్‌లపై హుకుం జారీ చేశారు. మున్సిపల్ అధికారులు సైతం తలాడించారు. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తే తమను ఎవరూ ఏమీ చేయ లేరన్న ధీమాతో బాండ్‌లు జారీచేశారు.తాడే పల్లిగూడెంలో మంజూ రైన టీడీఆర్ బాండ్‌ల విలువ రూ. 150 కోట్ల మేర ఉంటుంది. వాటిని రూ.60 కోట్లకు విక్రయించారు.అందులో మూడొంతుల మేర వైసీపీ నేత లబ్ధిపొందారు. కేవలం మీడియా అల్లర చేస్తుందంటూ ఇప్పుడు సదరు నేత అక్కసు వెళ్లబోస్తున్నారు. నిజాలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కానీ బాండ్‌లు మంజూరు చేసిన అధికారులు మాత్రం వణికిపోతున్నారు. తమకు వేటు తప్పదన్న భావనకు వచ్చేశారు. దాంతో కూటమి నేతలతో సంప్ర దింపులు జరుపుతున్నారు. తాము తీసుకున్న సొమ్ములను ఇచ్చేస్తామంటూ రాయబారాలు నెరపు తున్నారు. కానీ కొద్దిపాటి లబ్ధి పొంది బాండ్‌లు మంజూరు చేసేశారు. వైసీపీ నేతకు కోట్ల లబ్ధిపొందేలా చేశారు. ఇప్పుడు అధికారులపై వేటు కత్తి వేలాడేలా చేసింది.

సమాచారం సేకరించిన కమిటీ

తాళ్లముదునూరు పాడులో అగిరి నాగభూషణ రావు పేరుతో జారీ చేసిన బాండ్‌లపై జిల్లా కమిటీ సమాచారాన్ని సేకరించింది. నాగభూషణరావుతో స్థల యజమానులు అపార్ట్ మెంట్ నిర్మాణానికి ఒప్పందం చేసుకున్నారు. టీడీఆర్ బాండ్‌లు జారీ అయితే వాటిని కూడా సదరు అపార్ట్ మెంట్‌కు వినియోగించేలా ఒప్పందం కుదిరింది. అయితే మాస్టర్ ప్లాన్‌లో ఉన్న రహదారిని మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేసే బాధ్యత యజమానులపై ఉంటుంది. మరోవైపు జూన్ 15వ తేదీన రిజిస్ట్రేషన్ చేస్తే అదే నెల 16వ తేదీన బాండ్‌లు జారీ చేసేశారు. వాస్తవానికి అవి ఎన్ని గజాలు..క్షేత్రస్థాయిలో స్థలం ఉందా...లేదా అనే విషయాన్ని సర్వేయర్ ద్వారా పరిశీ లించాలి. అన్నీ సవ్యంగా ఉంటేనే బాండ్‌లు జారీ చేయాలి. ఒక్కరోజు వ్యవధిలోనే బాండ్‌లు జారీచేయడంపై కమిటీ దృష్టి పెట్టింది. రహదారి విస్తరణ లేనప్పుడు బాండ్‌లు ఎందుకు జారీ చేశారన్న విషయంపైనా కమిటీ ఆరా తీసింది. తాడేపల్లిగూడెం నుంచి భీమవరం వెళ్లే మార్కెట్ రహదారి పైనే ఇతర చోట్ల టీడీఆర్ బాండ్‌లు జారీచేశారు. వీటన్నింటిపై ఇప్పుడు కూటమి కూడా ఆరా తీసింది. సీబీసీఐడీ దర్యాప్తునకు పట్టుబడుతోంది. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మున్సి పాలిటీలో జారీ అయిన బాండ్‌లన్నింటినీ పరిశీలించేందుకు సీబీసీఐడి ఒక్కటే మార్గమని కూటమి నేతలు భావించి ఆ దిశగా పావులు కదుపుతున్నారు.

బాండ్‌ల సొమ్ములు ఎలా మళ్లాయి ?

టీడీఆర్ బాండ్‌లను విక్రయిస్తే పారదర్శకంగా సొమ్ములు తీసుకోవాలి. కొనుగోలు చేసిన వ్యక్తులు కూడా అదే పద్ధతిలో జమ చేయాలి. తాళ్లముదునూరుపాడు బాండ్‌ల విషయంలో స్థల యజమానులకు సొమ్ములు ముట్టలేదు. బిల్డర్ అగిరి నాగభూషణరావు పేరుతో అయినా సొమ్ములు జమచేయాలి లేదంటే వేరెవరి పేరుతో జమ చేశారా అన్న దానిపై కూటమి నేతలు ఆరా తీస్తున్నారు. వైసీపీ నేత సొంత వ్యక్తుల ఖాతాల్లో జమ చేశారని అనుమానిస్తున్నారు. బాండ్‌లు ఎవరి పేరుతో ఉంటే వారిపేరు మీద సొమ్ములు జమ చేయకపోతే కొనుగోలు చేసిన బాండ్‌లు రద్దయ్యే అవకాశం ఉంటుంది. దాంతో తాడేపల్లిగూడెంలో జారీ అయిన బాండ్‌ల అమ్మకాల్లో సొమ్ములు పంపిణీ కూడా ఇప్పుడు కీలకమైంది. సీబీసీఐడి దర్యాప్తు చేపడితే అన్ని విషయాలు వెలుగులోకి రానున్నాయి.

నోటు కొట్టు సర్టిఫికెట్ పట్టు..





యలమంచిలి మండలానికి చెందిన ఓ చిరు వ్యాపారికి కళ్లు బాగా కనిపిస్తాయి.. బైక్, సైకిల్ రెండూ నడుపుతాడు, సైకిల్ మీద ఇంటింటికి తిరిగి వ్యాపారం చేస్తాడు. అయితే ఇతను అంధత్వం ఉందని సదరం సర్టిఫికెట్ సంపాదించాడు. ఇదే మండ లంలో మరో వ్యక్తి ఆటో నడుపుతాడు. ఇతనికి నరాలకు సంబంధించిన లోపం ఉందని సదరం సర్టిఫికెట్ ఇచ్చారు. వీరిద్దరూ ప్రభుత్వం ఇచ్చే దివ్యాంగుల పెన్షన్ అందుకుంటున్నారు. వీరిద్దరికీ సర్టిఫికెట్ల జారీ చేయడంలో వైసీపీకి చెందిన ఓ ముఖ్య నాయకుడు, ఒక వలంటీర్ ప్రమేయం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని సదరం సర్టిఫికెట్లు ఇప్పించారన్నది ఆ మండలంలో పబ్లిక్ టాక్..

నరసాపురం పట్టణంలో ఒక వ్యక్తికి ప్రమాదంలో కాలు విరిగింది. ఆపరేషన్‌తో బాగా సెట్ అయినా 50 శాతం వైకల్యం ఉందని సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో గత కొంతకాలం నుంచి పెన్షన్ అందుకుంటున్నాడు. ఇది కూడా ఓ వైసీపీ నాయకుడి అండదండల వల్లే సాధ్యమైందని ఆ వార్డులోని ప్రజలు చెప్పుకోవడం గమనార్హం. ఇలా చెప్పుకుంటూ పోతే జిల్లాలో ఎన్నో నకిలీ సర్టిఫికెట్లు గత ప్రభుత్వ హయాంలో జారీ అయ్యాయి.

- జిల్లాలో వందల సంఖ్యలో బోగస్ సదరం సర్టిఫికెట్లు
- పెన్షన్లు, రైల్వేలో రాయితీల కోసం అక్రమ మార్గాలు
- ఏటా ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు గండి
- కొత్త ప్రభుత్వం తనిఖీలకు ఆదేశం
- కేటుగాళ్లలో భయం



నరసాపురం, జూలై 14: పెన్షన్లు, రాయితీల కోసం కొంతమంది అడ్డదారులు తొక్కుతున్నారు. ఏదోలా సదరం సర్టిఫికెట్లు సంపాదిస్తున్నారు. అక్రమ సర్టిఫికెట్ల వల్ల ప్రభుత్వ ఖజానాకు కోట్లాది రూపాయలు గండిపడుతోంది. వీటిపై అనేక ఫిర్యాదులు అందడంతో కొత్త ప్రభుత్వం దృష్టి సారించింది. తనిఖీలకు ఆదేశించడంతో ఈ కేటుగాళ్లలో భయం నెలకొంది. ఈ సర్టిఫికెట్లు ఎక్కువగా చెవిటితనానికి సంబంధించినవే ఉన్నాయి. గతంలో వినికిడిలోపం ఉంటే ఇట్టే తెలిసి పోయేది. సరిగ్గా వినిపించేందుకు చెవులకు మిషన్లు పెట్టుకునేవారు. అయితే ఇప్పుడు చెవి లోపల పెట్టుకునే చిన్న మిషన్లు వచ్చాయి. ఇవి బయటకు కనిపించవు. చాలామంది ఈ లోపం లేనప్పటికీ ఈ మిషన్లు పెట్టుకుని సర్టిఫికెట్ల కోసం లోపం ఉన్నట్లు నటిస్తున్నారు. ఆడియోగ్రాఫ్ రికార్డు తీసుకొచ్చి వైద్యుల్ని సంప్రదిస్తున్నారు. వారి దగ్గర మిషన్లు బయటకు తీసి నటిస్తున్నారు. చిన్న లోపం ఉన్నప్పటికీ దాన్ని పెద్దగా చూపించి రాజకీయ ఒత్తిళ్లు, కాసులిచ్చి సర్టిఫికెట్‌లను పట్టేస్తున్నారు. ఇక రైల్వే రాయితీల కోసం కేటుగాళ్లు ఎన్నో అడ్డదారులు తొక్కుతున్నారు. సదరం సర్టిఫికెట్ లేకుండానే ఆస్పత్రుల సూపరిడెండెంట్‌లను సంప్రదించి రైల్వే రాయితీ ఫారాల మీద సంతకాలు పెట్టిస్తున్నారు. ఇలాంటి సర్టిఫికెట్లు రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి తీసుకొచ్చి రైల్వే టిక్కెట్లలో రిజర్వేషన్ పొందడంతో పాటు దర్జాగా ఏసీ కోచ్‌లలో ప్రయాణం చేస్తున్నారు.

45శాతం దాటిన వారికే సర్టిఫికెట్ జారీ

మేనరికం, జన్యు లోపం, పౌష్టికఆహార లోపం వల్ల చాలామందికి పుట్టికతోనే వైకల్యం వస్తుంది. మరికొందరికి ప్రమాదాల్లో, ఇంకొందరికి పక్షవాతం వల్ల, కీళ్ల సంబంధిత వ్యాధుల కారణంగా వైకల్యం ఏర్పడుతుంది. ఇలాంటి వారిని పరీక్షించి ఎంతశాతం వైకల్యం ఉందన్నది వైద్యులు నిర్ధారించి సర్టిఫికెట్ జారీ చేస్తారు. గతంలో ఈ సర్టిఫికెట్‌ల జారీలో పెద్ద ఎత్తున అవి నీతి జరిగింది. అయితే సదరం విధానం రావడంతో వీటికి గండిపడింది. వైద్యులు అన్ని పరీక్షలు చేసిన తరువాతే సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు అయితే గత ప్రభుత్వ హయాంలో ఈ సర్టిఫికెట్ల జారీలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయన్న వాదనలు వినిపించాయి.వైసీపీ నాయకుల ఒత్తిళ్ళ వల్ల కొంత మంది వైద్యులు ఎక్కువశాతం వెకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్లు ఇచ్చారన్న ఆరోపణలు లేకపోలేదు. ఇందుకు కారణం ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ల కోసమే. 20 నుంచి 30 శాతం వైకల్యం ఉన్నప్పటికీ 45 శాతం దాటిసర్టిఫికెట్ ఇచ్చేస్తున్నారు ఈకారణంగా దివ్యాంగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 28,399 మంది దివ్యాంగులు పెన్షన్ అందుకుంటున్నారు. మరో 10వేల మంది కొత్తగా పెన్షన్ల కోసం చూస్తున్నారు. గతంలో పెన్షన్ రూ. 1000 ఉండేది. 2014లో ప్రభుత్వం దీన్ని రూ.2వేలు చేసింది. గత ప్రభుత్వం రూ.3 వేలు చేయగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీన్ని రూ.6వేలకు పెంచింది. దీంతో కొంత మంది కేటు గాళ్లు అక్రమమార్గాల వైపు వెళ్లుతున్నారు. కొంతమంది లంచం ఇచ్చి సర్టిఫికేట్ పొందితే, మరికొందరు రాజకీయ నేతల అండదండలతో సర్టిఫికెట్లను సంపాదిస్తున్నారు. వీటిపై అనేక ఆరోపణలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం తనిఖీలకు ఆదేశించింది. వాస్తవాలు పరిశీలించి అర్హులైన లబ్ధిదారుల్ని మాత్రమే ఎంపిక చేయాలని ఆదేశించడంతో కేటుగాళ్లలో గుబులు పట్టుకుంది.

అర్హులైన దివ్యాంగులకే పెన్షన్ ఇవ్వాలి



దివ్యాంగులకు ఇచ్చే పెన్షన్ పెంచడంతో చాలామంది కేటుగాళ్లు నకిలీ సర్టిఫికెట్లను సంపాదించి లబ్ధిదారులుగా చెలామణీ అవుతున్నారు. వీటిపై విచారణ చేయించాలి. అర్హులైన వారికే పెన్షన్ ఇవ్వాలి. గత ప్రభుత్వంలో జారీ అయిన సదరం సర్టిఫికెట్లను తనిఖీ చేయించాలి. వైకల్యం లేకపోయినా ఉన్నట్లు సర్టిఫికెట్లు ఇచ్చే వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే నిజమైన దివ్యాంగులకు న్యాయం జరుగుతుంది.

- అప్పారావు, జిల్లా దివ్యాంగుల సంఘం ఉపాధ్యక్షుడు



మొగల్తూరులో మునిగిన ఆకుమడులు



యర్రంశెట్టి పాలెంలో నీటిని బయటకు తోడుకుంటున్న రైతు

ఆదిలోనే అవస్థలు

వర్షాలకు మునుగుతున్న నారుమడులు

నరసాపురం రూరల్/ మొగల్తూరు, జూలై 14: అన్న దాతలకు ఆదిలోనే కష్టాలు మొదలయ్యాయి. వర్షాలకు ఆకుమడులు మునుగుతున్నాయి. ఇప్పటికే వేలకు వేలు పెట్టుబడులు పెట్టి ఆకుమడులు వేస్తే వర్షాలు రైతుల్ని తీవ్రంగా దెబ్బతీశాయి. మళ్లీ పెట్టుబడులు పెట్టి సాగు చేయాలంటే రైతులకు భారమవుతుంది. నరసాపురం సబ్‌డివిజన్ పరిధిలో సుమారు 150 ఎకరాల్లో ఆకుమడులు నీట మునిగాయి. నరసాపురంలో 50 ఎకరాలు ఆకుమడి మునకగా 20 ఎకరాల వరకు పూర్తిగా నష్టం జరిగింది. మండలంలోని ఎల్‌బీ చర్ల, వైఎస్‌పాలెం, చిట్టవరం, పసలదీవి, చినమామిడిపల్లి, మల్లవరం, మల్లవరంలంక, కొప్పర్రు, రుస్తుంబాద గ్రామాల్లోని చేలు చెరువుల్ని తలపిస్తున్నాయి. యలమంచిలి మండలంలో 70 ఎకరాల వరకు ఆకుమడులు నీట మునిగాయి. మరోవైపు వ్యవసాయశాఖ ఆదికారులు జరిగిన నష్టంపై సర్వే చేస్తున్నారు. కొంతవరకు ఆడుమడులు, నారుమడులు మునిగితే వరి వంగడాలకు ఆకు ముడత, మండి క్లోరిపైరిడ్ 5 సెంట్ల నారుమడికి ఒక కేజీ చొప్పున పిచ్చికారీ చేస్తే రైతులకు కొంత వరకు మేలు జరుగుతుందని ఏడీఈ అనిల్‌కుమారి తెలిపారు. రైతులు ఆందోళన చెందా ల్సిన అవసరం లేదని ఆకుమడుల్లో చేరిన నీటిని తొలగిస్తే సరిపోతుందని మొగల్తూరు వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆకుమడులు చుట్టూ గట్లు ఎత్తుగా ఉండేలా చూడాలన్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మడుల్లో వర్షపు నీటిని తొలగించి నారుపై రెండు గ్రాముల కార్బెండిజమ్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలనానరు. మండలంలో సుమారు 980 ఎకరాల్లో సార్వా సాగు చేపడతారని అంచనా వేస్తున్నామని ఇప్పటి వరకూ కేవలం 70 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారన్నారు.

పొంగుతున్న ఎర్రకాలువ

తాడేపల్లిగూడెం రూరల్: ఎర్రకాలువ తాడేపల్లిగూడెం మండలంలో పొంగిపర్లుతోంది. ఎగువన కొంగువారిగూడెం నుంచి దిగువకు వస్తున్న వరదనీటితో కాలువ నిండి పోయింది. దీంతో ఎర్రకాలువ పరివాహక గ్రామాలైన మాధవరం, జగన్నాధపురం, మారంపల్లి, గ్రామాల్లో వరిచేలు నీటమునుగుతున్నాయి. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి సరిహద్దు గ్రామాలుగా ఉన్న మాధవరం-కంసాలిపాలెం గ్రామాల మధ్య ఉన్న వంతెన గతంలో వరదలకే కొట్టుకు పోవడంతో రైతులు వేసుకున్న కాలిబాటపై నుంచి ఎర్రకాల్వ ఉధృతితో రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాలు మరో రెండు రోజులు కొనసాగే ప్రమాదం ఉందని వాతావరణ నిపుణులు చెప్తుండటంతో రైతుల్లో ఆందోళన మొదలైంది.



దిరుసుమర్రు గ్రామంలోని గునుపూడి సౌత్ డ్రైన్‌లో గుర్రపుడెక్క తొలగింపు పనులను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఆదివారం ప్రారంభించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.



మాధవరం- కంసాలిపాలెం గ్రామాల మధ్య పొంగి పొర్లుతున్న ఎర్రకాలువ



పెరిగిన గోదావరి 7

రూ.42.50 కోట్లతో శ్రీవారి క్షేత్రంలో అభివృద్ధి పనులు



ముగిసిన రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలు



ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన బాల, బాలికలకు బహుమతులు అందజేత

పాలకొల్లు రూరల్, 14 జూలై: పాలకొల్లులోని మామిడి చిన వెంకట శివయ్య మెమోరియల్ టౌన్‌హాల్లో రెండురోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 టెన్నిస్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. పోటీల్లో అండర్-8 విభాగంలో సీహెచ్ యక్షిత్ ప్రథమ స్థానం (శ్రీకాకుళం), ఈ.దాక్షిత్ ద్వితీయ స్థానం (ప.గో.జిల్లా), అండర్-10 విభాగంలో ప్రథమ స్థానం వై.కార్తీక్ (తూ.గో.జిల్లా), ద్వితీయ స్థానం పీవీ స్తుతిశ్రీ (గుంటూరు), అండర్-12 విభాగంలో ప్రథమ స్థానం వి.భవన్‌ధీరజ్ (ప.గో.జిల్లా) ద్వితీయ స్థానం జె.ఎస్పీ ప్రద్యున (తూ.గో.జిల్లా) అండర్-12 బాలికల విభాగంలో ప్రథమం కె.తేజు (తూ.గో.జిల్లా) ద్వితీయం వి. వినత (విశాఖ), అండర్-14 బాలికల విభాగంలో కె.తేజు (తూ.గో.జిల్లా) ద్వితీయం స్పార్కిల్ ఎంజెల్ (ప.గో.జిల్లా) అండర్-14 బాలుర విభాగంలో ప్రథమం భువన్ వీరేశ్ (ప.గో.జిల్లా), ద్వితీయం ఐ.దుర్గాశ్రీఅఖిల్ (ప.గో.జిల్లా) గెలుపొందారని ఆర్గనైజర్ వి.మోహన్‌కళ్యాణ్ తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు టౌన్‌హాల్ కార్యదర్శి ముచ్చర్ల ఆదినారాయణ బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో కోటికలపూడి కృష్ణ, డీవీఎస్ఎన్ రెడ్డి, కె.కిరణ్, శంకర్ పాల్గొన్నారు.

భీమవరం శాఖ యూత్ హాస్టల్‌కు ఉత్తమ అవార్డు



ఉత్తమ జిల్లా యూనిట్ అవార్డును అందుకుంటున్న మట్లపూడి సత్యనారాయణ

భీమవరం టౌన్, జూలై 14 : యూత్ హాస్టల్ భీమవరం శాఖ ఉత్తమ జిల్లా యూనిట్‌గా ఎంపికైందని ఆదివారం విశాఖ పట్నంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ప్రకటించారు. అదేవిధంగా ద్వితీయ ఉత్తమ యూనిట్‌గా పాలకొల్లు, తృతీయ యూనిట్‌గా గుంటూరు యూనిట్ ఎంపికైంది. జిల్లా ఉత్తమ యూనిట్‌గా ఎన్నికైన సందర్భంగా యూనిట్ ఛైర్మన్ మట్లపూడి సత్యనారాయణకు అవార్డును బహూకరించారు. గత మూడేళ్లుగా రాష్ట్రంలో ఉత్తమ జిల్లా యూనిట్‌గా భీమవరం శాఖ ఎంపిక అవుతోందని సత్యనారాయణ తెలిపారు. ఆయనకు రాష్ట్ర ఛైర్మన్ చీమల రవిపాల్ అభినందించి బహుమతిని అందించారు. ఉత్తమ అవార్డు సాధించినందుకు యూనిట్ అధ్యక్షుడు మంతెన వెంకటనరసింహరాజు, కార్యదర్శి నందమూరి రాజేష్‌లను అభినందించారని ఆయన తెలిపారు.

వాసవీ మాత దర్శనం పూర్వ జన్మ సుకృతమే..

▸ ప్రముఖ సంగీత దర్శకుడు కోటి


సంగీత దర్శకుడు కోటిని సత్కరించిన ఆలయ అధికారులు

పెనుగొండ, జూలై 14 : ప్రపంచంలోని అత్యంత ఎత్తైన వాసవీ మాత విగ్రహాన్ని దర్శించుకోవడం పూర్వ జన్మ సుకృతమని ప్రముఖ సంగీత దర్శకుడు కోటి అన్నారు. ఆదివారం అఖిల భారత శ్రీవాసవి పెనుగొండ ట్రస్టు ఆధ్వర్యంలో వాసవి శాంతి ధామ్‌ను ఆయన సందర్శించారు. 102 అడుగులు రుషీ గోత్ర మందిరంలోని వాసవీమాత పంచలోహ విగ్రహాన్ని దర్శించుకుని, మరకత శిల వాసవి మాతకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు శిష్టా మణికంఠ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ గోవిందరాజులను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆలయ అధికారులు కోటిని సత్కరించారు.

గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన


జగన్నాథపురంలో సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 14: తాడేపల్లిగూడెం మండలంలో ఉపాధి హామీ పనులను పరిశీలించేందుకు కేంద్ర బృందం ఆదివారం పర్యటించింది. కడియద్ద, జగన్నాథపురం, దండగర్ర గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. కేంద్ర బృందం న్యూఢిల్లీ కృషిభవన్ డైరెక్టర్ జితేంద్రసింగ్ నేతృత్వంలో ఈ బృందం మండలంలోని జగన్నాథపురం సంపద సృష్టి కేంద్రం, ఫారం పాండ్ పరిశీలించగా కడియద్దలో ఉపాధిహామీ పథకంలో ఏర్పాటు చేసిన మైనర్ ఇరిగేషన్ ట్యాంకు, దండగర్ర శివారు లింగారాయుడుగూడెంలో కొబ్బరిమొక్కల ప్లాంట్‌ను పరిశీలించారు. గతఐదేళ్లుగా ఉపాధి హామీ పథకంలో భాగంగా పంట బోదెలు పూడికలు సరిగా తీయకపోవడం వల్ల మురుగునీరు బయటకు వెళ్లడంలేదని చేలు మునిగిపోతున్నాయని దండగర్రలో రైతులు కేంద్ర బృందం వద్ద చెప్పుకునే ప్రయత్నం చేయగా ఉద్యానశాఖ పీడీ ప్రభాకర్ ఇది సమస్యలు చెప్పుకునే బృందం కాదని ప్రగతి పరిశీలించే బృందం అని వారించడంతో రైతులు నిరాశతో వెనుతిరిగారు.

రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రతిభ


చంద్రశేఖర్

నూజివీడు టౌన్, జూలై 14: నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న టి. చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. ఏపీఆర్‌సెట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన చంద్రశేఖర్ కంప్యూటర్ సైన్స్ విభాగంలో ప్రథమ స్థానం సాధించారు. ఆయనను ఆర్జీయూకేటీ అధికారులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆదివారం అభినందించారు.

11న ఉమ్మడి జిల్లా దేవదాయ ధర్మదాయ

శాఖ సిబ్బంది కార్యవర్గం ఎన్నిక

భీమవరంటౌన్, జూలై 14 : తణుకు సీతారామాంజనేయస్వామి ఆలయంలో ఆగస్టు 11వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ఉమ్మడి జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ సిబ్బంది సంఘ సమావేశం నిర్వహిస్తున్నట్టు జిల్లా అధ్యక్షుడు కె.అనంతరావు తెలిపారు. ఆదివారం తణుకులో నిర్వహించిన జిల్లా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. త్వరలో రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక ఉన్న నేపథ్యంలో ముందుగా జిల్లా కొత్త కార్యవర్గం ఎన్నిక కావలసి ఉందన్నారు. ఈ మేరకు వచ్చేనెల పదకొండో తేదీన ఎన్నిక జరుగుతుందని తప్పనిసరిగా సభ్యులందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కె. జగదీశ్వర రావు, కోశాధికారి ఎన్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, జూలై 14: ఇంటర్ చదువుతున్న తన కుమార్తె కిరాణా షాపునకు వెళ్తొస్తానని ఈనెల 13వ తేదీన వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని జంగారెడ్డిగూడెం ఎస్ఐ జ్యోతిబసు ఆదివారం తెలిపారు. చుట్టుపక్కల వెతికినా.. బంధువుల ఇంటి వద్ద ఆచూకీ కానరాకపోవడంతో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

శ్రీవారి క్షేత్రంలో

దినదినాభివృద్ధిగా చిన వెంకన్న క్షేత్రం

శరవేగంగా..



▸ రూ.42.50 కోట్లతో అభివృద్ధి పనులు

▸ భక్తుల సౌకర్యాలకు అధిక ప్రాధాన్యం

ద్వారకాతిరుమల, జూలై 14: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న ఏలూరు జిల్లాలోని ద్వారకాతిరుమల దివ్యక్షేత్రం దినదినాభివృద్ధి చెందుతూ భక్తుల సౌకర్యాలకు పెద్దపీట వేసింది. శ్రీవారు స్వయంభువుగా వెలిసిన క్షేత్రం కావడంతో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. దాదాపు రూ.120 కోట్ల వార్షిక ఆదాయం ఉన్న ఈ క్షేత్రానికి ఏటా ఆరు లక్షల మందికి పైబడి భక్తులు వచ్చి తమ మొక్కుబడులను తీర్చుకుని గర్భాలయంలో దివ్యమూర్తులుగా కొలువైన స్వామిని, అమ్మవార్లను దర్శించుకుంటారు. ప్రతీరోజూ సగటున ఆరు నుంచి ఏడు వేలు వరకు భక్తులు వచ్చినా శని, ఆదివారాల్లో ఈ సంఖ్య 30 నుంచి 40 వేలకు చేరుకుంటుంది. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా వారికి సౌకర్యాలను కల్పించేందుకు దేవస్థానం కృషి చేస్తోంది. ఈక్రమంలో ప్రస్తుతం క్షేత్రంలో దాదాపు రూ.42.50 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతూ పలు దశల్లో ఉన్నాయి.

భక్తుల సౌకర్యాలపై దృష్టి..

ఆలయానికి పలు ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకుగాను పలు నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. ఈక్రమంలో రూ.12.5 కోట్లతో ఆధునిక సౌకర్యాలతో అన్ని హంగులతో దర్శనం క్యూ కాంప్లెక్స్ నిర్మాణపనులు జరుగుతున్నాయి. భక్తులు కూర్చుని వెళ్లేందుకు సౌకర్యాలు, టాయిలెట్స్, మంచినీరు, టీవీ వంటి పలు సౌకర్యాలను కల్పిస్తున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్ తెలిపారు. ఆలయానికి అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు నీడ కల్పించేందుకు ప్రస్తుతం ఉన్న అనివేటి మండపాన్ని రూ.10 కోట్లు వెచ్చించి విస్తరిస్తున్నారు. ఈ క్రమంలో 100 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తుండగా ప్రస్తుతం అది స్లాబ్ దశకు చేరుకుంది. భక్తులకు మెరుగైన వసతిసౌకర్యం కల్పించేందుకు కొండపై మాధవ కల్యాణ మండపం వద్ద వున్న 120 గదుల వసతిగృహంపై రూ.10కోట్లు వెచ్చించి మరో 60 గదులు ఉండేలా ఫ్లోర్ నిర్మిస్తున్నామని.. ఈ నిర్మాణంలో భక్తులు సైతం విరివిగా విరాళాలిచ్చి భాగ స్వాములు కావచ్చన్నారు. మరో రూ.10 కోట్లు వెచ్చించి 200మీటర్ల పొడవు, 11మీటర్ల ఎత్తుతో గ్రానైట్ ఫ్లోరింగ్‌తో రిటైనింగ్ వాల్‌ను నిర్మిస్తున్నామన్నారు. ఇక్కడ గత వైభవం కన్పించేలా అర్చకులు తెల్లవారుజామున స్వామివారి సేవ నిమిత్తం తీర్థపు బిందె తీసుకొచ్చేలా కోనేరును నిర్మిస్తామిని, క్షేత్రవైభవాన్ని తెలిపేలా శిల్పకళా సౌందర్యాలను రూపొందిస్తున్నట్టు ఈఈ తెలిపారు. ఆలయ ఛైర్మన్ రాజా ఎస్‌వీ సుధాకరరావు నేతృత్వంలో ఈవో వేండ్ర త్రినాథరావు పర్యవేక్షణలో ఈఈ భాస్కర్ పనులను వేగవంతం చేస్తున్నారు.


రూ.12.50 కోట్లతో క్యూ కాంప్లెక్స్ పనులు


రూ.10 కోట్లతో రిటైనింగ్ వాల్ పనులు


120 గదుల వసతి గృహంపై చేపట్టిన నిర్మాణం


రూ.10 కోట్లతో అనివేటి మండప విస్తరణ పనులు

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించండి

▸ మంత్రి నాదెండ్లకు జిల్లా రేషన్ డీలర్ల సంఘ నాయకుల వినతి


మంత్రి నాదెండ్లకు వినతిపత్రం అందజేస్తున్న రేషన్‌డీలర్ల నాయకులు

ఏలూరు రూరల్, జూలై 14: రేషన్ డీలర్ల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రేషన్ డీలర్ల సమాఖ్య అధ్యక్షుడు దివిలీలా మాధవ రావు, జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు గంగాధరరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం అమరావతిలోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో మంత్రి నాదెండ్లను కలిసి వినతిపత్రం అందజేశామని వారు తెలిపారు. ఈ సందర్భంగా గంగాధరరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్లు ఎన్ని అక్రమాలకు పాల్పడినా వారిపై చర్యలు తీసుకోలేదని, ఇప్పటికి వారిపై ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్నారు. డీలర్లపై కేసులు నమోదుకు పెట్టే నిబంధనలు ఎండీయూ ఆపరేటర్లకు కూడా వర్తిస్తాయని, ఆపరేటర్లపై కేసులు నమోదైనప్పుడు వీఆర్వోల ద్వారా కాకుండా రేషన్ డీలర్లతో సరుకులు పంపిణీ చేయించాలని కోరారు. మండలస్థాయి నిల్వకేంద్రం నుంచి వంద శాతం తూకంతో సరుకులు ఇవ్వాలని, డీలర్ల గౌరవవేతనాన్ని పెంచాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

క్రైం కార్నర్

తండ్రి జ్ఞాపకాలతో కుమార్తె ఆత్మహత్య


అనూష మృతదేహం

ఏలూరు క్రైం, జూలై 14 : తండ్రి మరణించడంతో అతనిపై ఉన్న మమకారం, ప్రేమతో ప్రతి క్షణం జ్ఞాపకాలు నెమరువేసుకుటూ కుమార్తె కుంగిపోయింది. కళ్ల ముందు అమ్మ కనిపిస్తున్నా అమ్మ పక్కనే తోడుగా కనిపించే నాన్న రూపం ప్రతిక్షణం గుర్తుకురావడంతో తల్లడిల్లిపోయింది. ఎవరు కనిపించినా నాన్న రూపమే ఉందంటూ ఏడ్చింది. అదే ఆలోచ నలతో ఉండడంతో ఆకలిని కోల్పోయింది. అనుక్షణం నాన్న జ్ఞాపకాలే కనిపించడంతో ఇక తట్టుకోలేక చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఏలూరులో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతం శివగోపాలపురానికి చెందిన కుసుమూరి అనూష(16) ఏలూరు సెయింట్ థెరిస్సా కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. ఈ ఏడాది మార్చిలో తండ్రి దుర్గారావు అనారోగ్యంతో మృతి చెందాడు. తల్లి హేమలత కూలిపనులను చేస్తూ తన కుమార్తె అనూషను, పదో తరగతి చదివే కుమారుడు హేమంత్‌ను పోషిస్తుంది. అనూషను తండ్రి దుర్గారావు ఎంతో ప్రేమగా చూసేవాడని ఇరుగుపొరుగు వారు చెబుతున్నారు. కొద్ది రోజుల నుంచి తండ్రినే తలచుకుంటూ అన్నం తినడం మానేసి నీరసించింది. చివరకు ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో సీలింగ్ ఫ్యానుకు చున్నీతో ఉరివేసుకుంది. ఇరుగుపొరుగు వారు పరిస్థితి గమనించి వెంటనే కిందకు దించారు. అప్పటికే ఆమె మృతి చెందిందని నిర్ధారించారు. ఈ సమాచారం ఏలూరు టూటౌన్ పోలీసులకు అందడంతో సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐ మదీనాబాషా తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదివారం సాయంత్రం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని భార్య మృతి

▸ భర్తకు తీవ్ర గాయాలు

నల్లజర్ల, జూలై 14: రోడ్డు దాటుతుండగా కారు ఢీకొన్న ఘటనలో భార్య మృతిచెందగా భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. తాడేపల్లిగూడెం బేబీ సెంటర్ కాలనీకి చెందిన సొలసా బసవరాజు, సుబ్బలక్ష్మి(53), కుమారుడు సత్యశ్రీనివాస్ కారులో అనంతపల్లిలో ఉంటున్న కుమార్తె దేవీశిరీష వద్దకు శనివారం వచ్చారు. దైవ దర్శనం నిమిత్తం ద్వారకాతిరుమల వెళ్లి అనంతరం రాత్రి నల్లజర్ల శ్రీలక్ష్మీ మల్టీప్లెక్స్‌లో కల్కి సినిమా చూశారు. తల్లిదండ్రులను థియేటర్ వద్ద వదిలి, అక్కను అనంతపల్లిలో దించేందుకు సత్యశ్రీనివాస్ వెళ్లాడు. కుమారుడు అచ్చన్నపాలెం నుంచి నల్లజర్ల వైపు వస్తున్నాడని తెలిసి అటు వైపు వెళ్లేందుకు తల్లిదండ్రులు డివైడర్ వద్దకు వెళ్లారు. కుమారుడు ఫోన్ చేసి తాను థియేటర్ వద్దకే వస్తున్నానని, అక్కడే ఉండాలని చెప్పడంతో డివైడర్ నుంచి వారిద్దరూ వెనక్కి వస్తుండగా ఏలూరు నుంచి కొవ్వూరు వెళ్లే కారు ఢీకొట్టింది. బసవరాజుకు రెండు కాళ్లు విరిగిపోగా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో సుబ్బలక్ష్మి మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై అనుమానంతో భర్త ఉరి వేసుకుని మృతి

దెందులూరు, జూలై 14 :భార్యపై అనుమానంతో చెట్టుకు ఉరేసుకుని భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన దెందులూరు మండలంలో జరిగింది. ఎస్ఐ స్వామి, స్థానికులు తెలిపిన వివరాలివి.. ముప్పవరం పంచాయతీ పరిధిలోని నాగహనుమాన్‌కు చెందిన ఫ్యాక్టరీలో బిహార్ రాష్ట్రం గాయ్‌గాట్ మండలానికి చెందిన కె.రాజు మాంజీ అనే వ్యక్తి గత కొంతకాలంగా ఫ్యాక్టరీలో కార్మికుడిగా భార్యతో సహా పనిచేస్తున్నాడు, కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయని, భార్యపై అనుమానం పెంచుకుని ఆదివారం తెల్లవారుజామున ఫ్యాక్టరీ అవరణలో అతడు చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు, ఫ్యాక్టరీ సిబ్బంది గమనించి దెందులూరు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించామని కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బీచ్‌లో యువకుడి గల్లంతు

మొగల్తూరు, జూలై 14 :పేరుపాలెం బీచ్‌లో ఆదివారం ఓ యువకుడు గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాలివి.. నరసాపురం మండలం లక్ష్నేశ్వరానికి చెందిన ఆరుగురు యువకులు మధ్యాహ్నం బీచ్‌కు వచ్చారు. బీచ్‌లో స్నానానికి దిగిన ఈ ఆరుగురులో పాటి హనుమ అనే 18 ఏళ్ల యువకుడు గల్లంతయ్యాడు. హనుమ కోసం స్థానికులు, పోలీసులు గాలిస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ద్వారకాతిరుమల, జూలై 14: పోలవరం కుడి ప్రధాన కాల్వలో మండలంలోని గుణ్ణంపల్లి వద్ద స్నానానికి అని దిగిన ఓ వ్యక్తి రెండు రోజుల క్రితం గల్లంతై పెదవేగి మండలం ముండూరు బ్రిడ్జి వద్ద శవమై తేలాడు. అతడి పూర్తి వివరాలు తెలియలేదు. రాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఈ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అతడు మండలంలోని లక్ష్మీనగర్ అట్టల ఫ్యాక్టరీలో పనిచేస్తాడు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి అని పూర్తి వివరాలు తెలియాలంటే అతడి బంధువులు అక్కడ నుంచి రావల్సిందేనని పోలీసులు తెలిపారు.

బాకీ అడిగినందుకు చంపేస్తానని బెదిరింపు

ఆకివీడు, జూలై 14 : ఓ మహిళను రావాల్సిన బాకీ అడిగినందుకు తనను, తన భర్తను దుర్భాషలాడి చంపేస్తానని బెదిరించారని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు. స్థానిక పెద్దపల్లి వీధికి చెందిన కొప్పూరి కృష్ణవేణి చుక్క లక్ష్మిని ఈనెల తొమ్మిదో తేదీన తీసుకున్న డబ్బులు ఎప్పుడు ఇస్తావని అడిగింది. ఆదివారం చుక్క లక్ష్మి, చుక్క వెంకటేశ్వరరావు, చుక్క ఆములేశ్వరి, చుక్క దుర్గారావు, నరగాని సుష్మా అనే వారు కృష్ణవేణి ఇంటికి వెళ్ళి దుర్భాషలాడి, మరోసారి డబ్బులు అడిగినా, ఎవరికైనా చెప్పినా చంపేస్తామని తనను, తన భర్త సుబ్బారావును బెదిరించారని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఫంక్షన్‌కు వెళ్లొచ్చేసరికి ఇంటిని దోచేశారు

▸ అరకాసు బంగారం, నగదు, ఏటీఎం కార్డుల చోరీ..


తాళాలు తీసి ఉన్న బీరువా

జంగారెడ్డిగూడెం, జూలై 14 : పట్టణంలోని అయ్యప్ప టౌన్‌షిప్ నందు ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారంతో పాటు నగదు తస్కరించారని బాధితుడు బాసంశెట్టి నాగరాజు ఫిర్యాదు చేశాడని ఎస్ఐ జ్యోతిబసు తెలిపారు. పట్టణానికి చెందిన బాసంశెట్టి నాగరాజు ఓ పత్రికలో విలేకరిగా పనిచేస్తూ, శ్రీనివాసా థియేటర్ వద్ద పాన్ షాపు నిర్వహిస్తున్నాడు. స్థానిక అయ్యప్ప టౌన్‌షిప్ నందు మూడో రోడ్డులో నివాసం ఉంటున్నారు. ఈనెల పదమూడో తేదీ రాత్రి అదే ప్రాంతంలోని ఒకటో రోడ్డులో నివాసం ఉంటున్న తన బావమరిది కుమారుడు పుట్టినరోజు సందర్భంగా వారి ఇంటికి వెళ్లి రాత్రి పదిన్నర గంటలకు తిరిగి ఇంటికి వచ్చేసరికి ప్రధాన ద్వారం తెరిచి ఉంది. లోపలకు వెళ్లగా బీరువా తాళం తెరిచి అందులో ఉన్న నాలుగు గ్రాములు బంగారు చెవి రింగులు, బ్యాగులో ఉన్న కొంత నగదుతో పాటు షాపు, ఇంటి తాళాలు, జర్నలిస్టు అక్రిడిటేషన్ తదితర కార్డులున్న బ్యాగును తస్కరించారు. బాధితుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృత్యువాత


మృతిచెందిన పాడి గేదె

చింతలపూడి, జూలై 14: చింతలపూడి మండలం రేచర్ల గ్రామంలో ఆదివారం ఉదయం విద్యుదాఘాతానికి గురై పాడిగేదె మృతి చెందింది. మన్నం నాగరాజు అనే వ్యవసాయ కూలీ పని చేసుకుంటూ పాడిగేదెతో ఇల్లు గడుపుకుంటున్నాడు. ఉదయం మేతకు తీసుకువెళ్ళిన గేదె పొదల్లో గడ్డి మేస్తుండగా కిందివున్న విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందింది. విద్యుత్ తీగలు కిందకు వేలాడి పొదల్లో ఉండడంతో ఈ ప్రమాదం జరిగింది. అక్కడే ఉన్న యజమాని ఈ ఘటన చూసి కన్నీటిపర్యంతమయ్యాడు.



శ్రీకృష్ణుడిగా జగన్నాథుడు

ద్వారకాతిరుమల జూలై 14: నీలమేఘశ్యాముడైన శ్రీకృష్ణునిగా జగన్నాథుని దర్శనం భక్తులను అలరించింది. పురాతన లక్ష్మీపురం ఆలయంలో జరుగుతున్న జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా ఆదివారం రుక్మిణీసత్యభామ సమేతంగా స్వామివారు శంఖు, చక్రాలను, పిల్లనగ్రోవిని ధరించి, శిరస్సుపై నెమలిపింఛముతో నీలమేఘశ్యామునిగా దర్శనమిచ్చారు. ఈ అవతారంలో ఉన్న జగన్నాథుని దర్శించిన భక్తులు తరించారు.

భక్తులతో శ్రీవారి క్షేత్రం కళకళ

చిన్నతిరుమలేశుని క్షేతం భక్తుల గోవింద నామస్మరణలతో మార్మోగింది. అందరికీ సెలవు దినం కావడం వల్ల వర్షపు తుంపరలు పడుతున్నా.. భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దాదాపు పన్నెండు వేల మంది పైబడి భక్తులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయవర్గాలు భావిస్తున్నాయి.

పెరిగిన గోదావరి


స్పిల్‌వే వద్ద గోదావరి జలాల ఉధృతి

పోలవరం, జూలై 14 : పోలవరంలో గోదావరి నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉపనదులు శబరి, ఇంద్రావతి, సీలేరు, కిన్నెరసాని, మానేరు, ప్రాణహిత, మంజీర, పూర్ణ, ప్రవర నదుల నుంచి గోదావరిలో వరద జలాలు ప్రవహిస్తున్న నేపథ్యంలో గోదావరిలో నీటిమట్టం గత రెండు రోజులుగా క్రమక్రమంగా పెరుగుతుంది. స్పిల్‌వేలోకి వస్తున్న గోదావరి జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేయడం వల్ల స్పిల్‌వేలో సాధారణ నీటిమట్టం మాత్రమే నమోదైంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 27.040 మీటర్లు, స్పిల్వే దిగువన 17.340 మీటర్లు, కాఫర్ డ్యాంకి ఎగువన 27.300 మీటర్లు, కాఫర్ డ్యాంకి దిగువన 17.940 మీటర్లు నమోదైనట్లు ఈఈలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

పట్టిసీమ నుంచి 5,310 క్యూసెక్కులు విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 5,310 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్టు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు ఆదివారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 15.538 మీటర్లకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 5 పంపులు నిలిపి 15 పంపులు 15 మోటార్లతో నీటిని విడుదల చేసినట్టు తెలిపారు.

రోడ్లపై విచ్చలవిడిగా ఆవులు

▸ వాహనదారులు, మూగ జీవాలకు ప్రమాదాలు

▸ పట్టించుకోని పశువుల యజమానులు, అధికారులు


గాయపడిన ఆవు కాలికి శస్త్ర చికిత్స చేసిన దృశ్యం

గణపవరం, జూలై 14: పశువుల యజమానులు బాధ్యత రహితంగా రాత్రి సమయాల్లో ఆవులను వీధుల్లోకి వదిలేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అటువంటి వారిపై గ్రామ పంచాయతీ అధికారులు నోరు మెదపరు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నప్పటికీ పోలీసులు చొరవ చూపరు. వాటికి రాత్రి సమయంలో ఏమైనా జరిగితే అత్యవసర వైద్యం అందుబాటులో ఉండదు. గతంలో బందిలదొడ్డిలు ఉండేవి అవి ప్రస్తుతం లేకపోవడంతో ఇక పట్టించుకునే నాథుడు లేడు. ఆవులు అడ్డొచ్చి వాహనదారులు ప్రమాదాలకు గురువుతున్నారు. గణపవరం సెంటర్‌లో తాజాగా మూడు రోజుల క్రితం రోడ్డు మీద వున్న ఒక ఆవుకు వాహనం తగిలి కాలు విరిగి తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే కూలబడిపోయింది. వైద్యానికి వైద్యులెవరు అందుబాటులో లేకపోవడంతో చాలా సమయం పట్టింది. ఎట్టకేలకు ప్రముఖ సంఘసేవకుడు, లలిత పిరమిడ్ ధ్యాన కేంద్రం మాస్టరు పెరుమాళ్ళ మురళీకృష్ణ, మరికొంత మంది యువకులతో కలసి వైద్య సిబ్బందిని రప్పించి ప్రథమ చికిత్స అందించారు. ఇప్పటికైనా సంబంధిత పశువుల యాజమానులు పట్టించుకోవాలని, అధికారులు రహదారిపై ఆవులు సంచరించకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఉండిలో పూర్వ విద్యార్థుల చేయూత


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన 1988-89 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

ఉండి జూలై 14: తామంతా విద్య నేర్చుకున్న పాఠశాలకు తమ వంతుగా అభివృద్ధి పనులు చేస్తూ ముందుకు వెళుతున్నామని 1988-89లో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు హైస్కూలుకు విచ్చేసి శిథిలమైన పాఠశాల భవనాలను పరిశీలించి అక్కడికక్కడే దాతలను సమీకరించి అభివృద్ధికి చర్యలు చేట్టారు. అదే స్ఫూర్తితో ఆదివారం హైస్కూలులో విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో పలు కార్యక్రమాలు చేసేందుకు ప్రణాళిక వేసుకున్నట్టు తెలిపారు. ఇప్పటివరకు పాఠశాల అభివృద్ధికి సుమారు రూ.4 లక్షల వరకు అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. పాఠశాల ఆవరణలో పూడిక చేసినందుకు గుర్తుగా శిలాఫలకం ఆవిష్కరించారు. మరోసారి సమావేశమై పాఠశాల అభ్యున్నతికి పాటుపడేలా ప్రణాళిక రూపొందించి ముందుకు వెళతామన్నారు. పూర్వపు విద్యార్థులు గుళ్లిపల్లి అచ్చారావు, కొల్లి సాయిరాం, ముదునూరి బంగ్రారాజు, కర్రి శ్రీను, వీరమల్లు మల్లేశ్వరరావు, కొమ్మన రాఘవ, ఇందుకూరి శారద తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 14 : భీమవరం పొట్టి శ్రీరాములు పురపాలక బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం ఆనందంగా నిర్వహించారు. 1994-95లో టెన్త్ బ్యాచ్ స్నేహితులందరూ ఒక్కటై సందడిగా గడిపారు. ఆనాడు చదువులు చెప్పిన గురువులను, ప్రస్తుత పాఠశాల హెచ్‌ఎం రాధాకృష్ణనూ సత్కరించారు. అనంతరం అప్పటి తరగతి గదులను చూసుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఒకరికి ఒకరు తమ యోగక్షేమాలు తెలుసుకుంటూ, ఆటపాటలతో సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా స్కూల్‌కు చిరు కానుకలు అందజేశారు.

విద్యార్థినికి సైకిల్ అందజేత



విద్యార్థినికి సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు

భీమవరం టౌన్, జూలై 14 : శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బ్యాంక్ కాలనీలోని ఎమ్మెల్యే నివాసం వద్ద ప్రతిభ కలిగిన పేద విద్యార్థినికి దాతల సహకారంతో సమకూర్చిన సైకిల్‌ను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఆదివారం అందజేశారు. నిర్వాహకులు చెరుకువాడ రంగ సాయి మాట్లాడుతూ పట్టణంలోని వీఎస్ఎం గరల్స్ హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి దుక్క సత్యశ్రీకి దాత ఐఎంఏ గొట్టుముక్కల బాలకృష్ణరాజు సతీమణి వినితాకుమారి ఆర్థిక సహకారంతో సైకిల్‌ను సమకూర్చారన్నారు. అనంతరం దిరుసుమర్రులో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. టీడీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు, పృధ్వీశంకర్, మెగాపుల గంగరామ్, పొత్తూరి బాపిరాజు, హెచ్ఎం వారణాసి రాధాకృష్ణ, నరహరిశెట్టి కృష్ణ, ఆకుల కృష్ణ, సూర్యనారాయణ అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎంపీ జన్మదిన వేడుకలు



పేదలకు భోజన పొట్లాలు అందజేస్తున్న పెదబాబు

ఆకివీడు, జూలై 14 : నర్సాపురం పార్లమెంట్ అభివృద్ధికి మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు ఎంతో కృషి చేశారని నరేంద్ర మోదీ, గోకరాజు గంగరాజు సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నేరెళ్ళ పెదబాబు అన్నారు. మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు జన్మదినం సందర్భంగా ఆదివారం స్థానిక కార్యాలయంలో పెదబాబు కేక్ కట్ చేసి పేదలకు భోజన పొట్లాలు పంపిణీ చేశారు. వాడపల్లి రాంబాబు, వై.రఘు, కోమటి రాంబాబు, మజ్జి శ్రీను తదితరులు ఉన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలన్

ఆకివీడు, జూలై 14 : తాళ్లకోడులో మౌలిక వసతులు లేక ఇళ్లు నిర్మించుకున్న గృహస్థుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం కార్యదర్శి వర్గసభ్యులు జేఎస్వీ గోపాలన్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలనీలో రోడ్లు, మంచినీరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెంటనే మంజూర్ చేయాలన్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కె.తవిటినాయుడు, పి.అప్పారావు, డి.లక్ష్మి, ఎస్.ఉదయకుమారి, డి.రవితేజ ఉన్నారు.

విద్యుత్ బిల్లులు తీయడంలో నిర్లక్ష్యం

ఆకివీడు, జూలై 14 : విద్యుత్ బిల్లులు తీయడంతో నిర్లక్ష్యం కారణంగా వినియోగదారులపై అదనపు భారం పడుతుందని, సకాలంలో బిల్లులు తీయాలని వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర సహాధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య అన్నారు. ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ బిల్లులు ప్రతి నెల సమయం దాటిన తరువాత తీయడంతో శ్లాబ్ రేట్ పెరిగి వినియోగదారులపై ఆర్థిక భారం పడుతుందన్నారు. స్థానిక కోసూర్‌వీధిలో రెండు నెలలు డోర్ లాక్ అని రాసి మూడు నెలల బిల్లు ఒకేసారి తీయడంతో రూ. ఆరు వేలు వచ్చిందన్నారు. ఇది విద్యుత్ బిల్లులు తీసే కాంట్రాక్టర్ నిర్లక్ష్యమన్నారు. బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న భోగేశ్వరరావు

పెంటపాడు, జూలై 14: విద్యార్థులు చిన్ననాటి నుంచే దేశభక్తిని అలవర్చుకోవాలని టీబీఆర్ సంస్థ అధినేత తనుబుద్ధి భోగేశ్వరరావు అన్నారు. టీబీఆర్ డిఫెన్స్ అకాడమీలో సైనిక శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. అలంపురం రమ్యా ఎంటర్ ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను సందర్శించి దుస్తుల తయారీ విధానం, ముడిసరుకు ఎక్కడి నుంచి వస్తుంది తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. కరస్పాండెంట్ పద్మావతి, డైరెక్టర్ రవికిరణ్, ప్రిన్సిపాల్ కరుణప్రసాద్, హెచ్ఎం కళ్యాణి, ఏవో నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో-2 సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా రామకృష్ణ



పెంటపాడు, జూలై 14: ఎంఈవో-2 సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా పెంటపాడు మండలం ఎంఈవో-2 టీవీ రామ కృష్ణ నియమితులయ్యారు. గుంటూరులో శనివారం జరిగి న సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, విద్యా వేత్త సుభాష్‌చంద్రబోస్ సమక్షంలో జరిగిన కార్యవర్గ ఎంపి కలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంఈవో-2ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రామకృష్ణ అన్నారు.

ఘనంగా షో దశి పూజా మహోత్సవం



షోడశి పూజా మహోత్సవానికి విచ్చేసిన పలు క్షేత్రాలకు చెందిన పీఠాధిపతులు

పెనుగొండ, జూలై 14 : పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి కృష్ణానంద పురి స్వామీజీ శివైక్యం చెందడంతో దేశం నలుమూలల నుంచి వచ్చిన సాధువులు, స్వామీజీలు షోడశి పూజా మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కృష్ణానంద పురి స్వామీజీ శివైక్యం చెంది 16 రోజులు కావడంతో అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్టు ఆధ్వర్యంలో వాసవీ శాంతి ధామ్‌లో షోడశి పూజా మహోత్సవం నిర్వహించారు. ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గోవిందరాజులతో పాటు పలు ప్రాంతాలకు చెందిన పీఠాధిపతులు కమలానంద భారతీ స్వామి, కరకట్ల మాతా శివచైతన్య, పెదపులిపాక వాసుదేవానంద గిరి, ఏర్పాడు వ్యాసాశ్రమ పీఠాధిపతులతో పాటు మరో 24 క్షేత్రాలకు చెందిన పీఠాధిపతులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆర్థిక సాయం

పాలకొల్లు, జూలై 14 : పట్టణంలోని 15వ వార్డులో నివశిస్తున్న వృద్ధురాలు ఉల్లి కృష్ణవేణి పక్షవాతంతో బాధపడుతూ మందులు కొనుక్కోవడానికి ఇబ్బంది పడుతున్న విషయం వాకర్స్ క్లబ్ దృష్టికి రావడంతో స్పందించిన క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు ఆమెకు రూ.ఏడు వేల విలువైన మందులను ఆదివారం క్లబ్ తరుపున అందజేశారు. కార్యదర్శి షేక్ పీర్ సాహేబ్, కోశాధికారి పోతుల ఉమా శంకరరావు, ఉపాధ్యక్షుడు మానేం బసవ రాజు, నంబూరి గంగా పవన్, బొలిశెట్టి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

అత్తిలి, జూలై 14: ఎస్సీ, ఎస్టీ బ్యాగ్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ఉండ్రాజవరపు సూర్య ప్రకాష్ డిమాండ్ చేశారు. అత్తిలిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

కుక్కల స్వైర విహారం

దాడులతో ప్రజలు బెంబేలు



అత్తిలి, జూలై 14 : మండలంలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. పంచాయతీల్లో, వార్డుల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలను చూసి స్థానికులు భయాందోళన చెందుతున్నారు. చిన్నారులపై కుక్కలు దాడి చేస్తున్నాయి. విద్యార్థులను పాఠశాలకు పంపాలంటే తల్లిదండ్రులు జంకుతున్నారు. రాత్రి వేళ ఒంటరిగా బయటకు వెళ్లాలంటే ప్రాణాలరచేతిలో పెట్టుకుని వెళ్ళాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఒకప్పుడు గ్రామాల్లో కుక్కలను పట్టి చంపేసేవారు. గత కొంతకాలంగా జంతు సంరక్షణ చట్టం ఆదేశాలతో ఈ చర్యలకు బ్రేక్ పడింది. సంతానం వృద్ధి కాకుండా గతంలో శస్త్ర చికిత్సలు చేసేవారు. ప్రస్తుతం అవేమీ చేయకపోవడంతో కుక్కలు విపరీతంగా పెరిగిపోయి ప్రజల్ని భయకంపితుల్ని చేస్తున్నాయి. రాత్రి సమయంలో తమ పిల్లలు ట్యూషన్‌కు వెళ్ళి ఇంటికి వచ్చే వరకూ ఆందోళనగా ఉంటోందని తల్లిదండ్రులు చెబుతున్నారు. కొన్ని నెలలుగా సమస్య తీవ్రంగా ఉందని ఆయా గ్రామాల్లో ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా కనీసం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

పీహెచ్‌సీలో వ్యాక్సిన్ కొరత

ఆరవల్లిలో శనివారం కుక్క బాలుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరచింది. సమీపంలోని మంచిలి పీహెచ్‌సీకి తీసుకెళితే వ్యాక్సిన్ లేదని తణుకు తీసుకువెళ్ళాలని తెలిపారని బాధితులు వాపోయారు. శునకాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుని చిన్నారుల ప్రాణాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

సుపరిపాలన అందించడమే కూటమి ధ్యేయం



ఎమ్మెల్యే నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లిలను సన్మానిస్తున్న స్థానికులు

మొగల్తూరు, జూలై 14 : ఎంతో నమ్మకంతో కూటమి పార్టీలను గెలిపించిన రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో సుపరిపాలన అందించడమే ధ్యేయమని నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. జగన్నాథపురంలో ఆదివారం నిర్వహించిన విజయోత్సవ ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం లేకుండా అవినీతి పాలన అందించడం వల్లే వారికి ప్రజలు చరమగీతం పాడారన్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు మంతెన రామరాజు మాట్లాడుతూ నరసాపురం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ సమావేశానికి కృష్ణా జిల్లా పెడన ఎమ్మెల్యే కాగితపు కృష్ణ ప్రసాద్, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, నరసాపురం టీడీపీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు, జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి చిన్నా, బీజేపీ నాయకులు మేకల సతీష్‌లను జగన్నాధపురం, కోమటితిప్ప గ్రామాల ప్రజలు సన్మానించారు. నరసాపురం, మొగల్తూరు మండలాలకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పైలా దాసుపై కఠిన చర్యలు తీసుకోవాలి



పైలా దాసు వ్యాఖ్యలను ఖండిస్తున్న భవానీ, తదితరులు

పాలకొల్లు, జూలై 14 : బ్రాహ్మణులపై సోష ల్ మీడియా వేదికగా అనైతిక వ్యాఖ్యలు చేస్తూ కులాల మధ్య చిచ్చు పెటడం, హిందూ దేవతలను దూషించడం బ్రాహ్మణ మహిళను వేశ్య అని అవమానించిన పార్వతీపురంనకు చెందిన పైలా దాసుపై కఠిన చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ బ్రాహ్మణ ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం జరిగిన ఐక్యవేదిక, శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి సేవా సమితిల అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లా డారు. బ్రాహ్మణ సాధికార సమితి నియోజక వర్గ కన్వీనర్ పెండ్యాల భవా నీ, నాయకులు మద్దూరి సూరిబాబు, మునుకుంట్ల రవీంద్ర, సీహెచ్ నరసింహమూర్తి, సేవా సమితి అధ్యక్షుడు శీరం ఆనందకృష్ణ మాట్లాడుతూ బ్రాహ్మణ మహిళలను వేశ్యలు అంటూ అభివర్ణించడం సరికాదని, క్షమా పణ చెప్పినా మహిళలు సహించరన్నారు. ఇటువంటి సంఘ విద్రోహ శక్తులను సమూలంగా రూపు మాపాలని పేర్కొన్నారు. యర్రమిల్లి శ్రీరామ సూర్య నరసింహారావు (వైఎస్ఆర్), చిర్రావూరి శ్రీరామచంద్ర మూర్తి, నందుల దశరథ్, నండూరి జానకిరామయ్య, ఏఎస్ఎస్ రమణ కుమార్, గోపరాజు గోపి, ఆలయ అర్చకులు కిష్టప్ప, పూర్ణయ్య అనీల్ కుమార్, పెండ్యాల సుబ్రహ్మణ్యం, మునునూరి ఫణి, కస్తూరి సుబ్బారావు, దింర్యాల రమ, పెండ్యాల ప్రమీల, కంభంపాటి ఉమామహేశ్వరి, గుడ్లవల్లేటి అలివేలు, కనుమూరి స్వాతి, కలగ సీత, దూపాటి అనంత పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న సోమసుందర్

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 14: ప్రైవేటీకరణ, ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలపై బ్యాంకు యూనియన్‌లు పోరాడతాయని యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. తాడేపల్లిగూడెంలో ఆదివారం నిర్వహించిన బ్యాంకు ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ 64వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సదస్సులో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు శీలా శ్రీనివాస్ మాట్లాడారు. స్టాఫ్ యూనియన్ వ్యవస్థాపకుడు జీజేకే మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఐబీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్, ఎస్‌బీఐ అధికారుల సమాఖ్య జోనల్ కార్యదర్శి జవహర్‌లాల్, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ నాయకుడు బాపయ్య శర్మ, స్టాఫ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, యూనియన్ సీనియర్ నాయకుడు ఎస్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

భీమవరం టౌన్, జూలై 14 : పట్టణంలోని సమస్యలపై సోమవారం ఉదయం 10 గంటల నుంచి మునిసిపల్ కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరించటం జరుగుతుందని కమిషనర్ ఎం.శ్యామల తెలిపారు. వచ్చిన సమస్యలను వెంటనే సంబంధిత అధికారులకు పంపించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీఎం చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు



ఎమ్మెల్యే కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న అంజిబాబు

భీమవరం టౌన్, జూలై 14 : చెవిటి, మూగ విద్యార్థులు తమకు పింఛన్ రూ.ఆరు వేలు పెంచినందుకు ఆదివారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో కేక్ కట్ చేయించి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంచి విజన్ ఉన్న నాయకుడని, ఆయన హయంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మూగ, చెవిటి విద్యార్థులకు ఎటువంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జనసేన పట్టణ అధ్యక్షుడు చేనమల్ల చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, భీమల శ్రీరామమూర్తి, యర్రంశెట్టి శివకృష్ణ, యర్రంశెట్టి లక్ష్మణ్, పొనకాల శ్రీనివాస్, చినమిల్లి గౌతమ్, చినమిల్లి నాగు, సీహెచ్ నందు, యూనియన్ ప్రెసిడెంట్ తోట రాము, వైస్ ప్రెసిడెంట్ గణిశెట్టి శివ శ్రీనివాస్, మాజీ మెంబర్ మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు



మాచేనమ్మ అమ్మవారు

మొగల్తూరు, జూలై 14 : ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఆలయానికి ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. మన ప్రాంతంతో పాటు సరిహద్దు జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. వచ్చే శ్రావణ, కార్తిక మాసాల్లో అమ్మవారికి మొక్కుబడులు చెల్లించేందుకు వీలు కాకపోవడంతో ఈ ఆదివారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. భక్తులకు కావల్సిన సదుపాయాలను ఈవో డి.రామకృష్ణంరాజు, ఆలయ సిబ్బంది ఏర్పాటు చేశారు.

● మోళ్ళపర్రు కనకదుర్గ బీచ్‌లో వేంచేసి ఉన్న దశావతార సహిత సత్యనారాయణ స్వామి, అష్టలక్ష్మీ సమేత ఆదిలక్ష్మీ అమ్మవార్ల ఆలయంలో నిర్వహిస్తున్న వారాహి నవరాత్రులలో భాగంగా ఆదివారం అమ్మవారి సన్నిధిలో నక్షత్ర దోషాటు కార్యసిద్ధ దుష్టగ్రహ నివారణకు విశేషార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రవీణ్ కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమానికి తీర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ కమిషనర్

ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మవారిని కృష్ణా జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ డీసీ చక్రధరరావు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఆయనకు సిబ్బంది ఘన స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో సత్కరించి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు.

శిశు మందిరంలో సూర్య హోమం



కోడి గట్టున సరస్వతి శిశు మందిరంలో సూర్య హోమం చేస్తున్న భక్తులు

పాలకొల్లు అర్బన్ : స్థానిక కోడిగట్టున గల శ్రీసరస్వతి శిశు మందిరంలో ఆదివారం లోక కళ్యా ణార్థం, కరోనా అతం కావాలని కోరుతూ సూర్య హోమం నిర్వహి ంచారు. కరోనా ప్రారం భమైన నాటి నుంచి ప్రతి ఆదివారం ఈ హోమాలు నిర్వహిస్తున్నామని ఇది 216 సూర్యహోమమని నిర్వాహకులు తెలిపారు. వేదపండితులు ములుకుట్ల రవీంద్రనాధ్ ఆధ్వర్యంలో సూర్య నమస్కారములు, శాంతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేవీఎస్ఎన్ నరసింహరాజు, భాస్కరరావు, కిరణ్ గుప్త, తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు సారె సమర్పణ

ఆచంట, జూలై 14 : ఆషాఢ మాసం పురస్కరించుకుని ఆదివారం ఆచంట ఆర్యవైశ్య సంఘం నేతలు పెనుగొండ వెళ్లి వాసవీ మాతకు సారె సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

● జిల్లాలో ప్రసిద్ధి చెందిన మాచేనమ్మ ఆలయం ఆషాఢ మాసం ఆదివారం భక్తులతో పోటెత్తింది. భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులు వాహనాలతో నిండి పోయింది. భక్తులకు ఆలయ అధికారి రాము, సిబ్బంది అధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



బండి ముత్యాలమ్మకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



మోళ్ళపర్రులో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



వాసవీ మాతకు సారె తీసుకు వెళుతున్న భక్తులు

ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటా: బొలిశెట్టి



బాధితుడ్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 14: ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణానికి చెందిన గణేశుల పవన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయప డడంతో ఆదివారం అతనిని బొలిశెట్టి పరామర్శించి వైద్య ఖర్చుల కోసం నగదు, నిత్యావసర సరుకులను అందజేశారు. సీహెచ్ రమేష్, జి.సూరిబాబు, జి.అయ్యన్న, పి.వెంకటరామయ్య, ఎం.మురళి, ముఖేష్ పాల్గొన్నారు.

రేలంగి మంటలాంబకు బొలిశెట్టి పూజలు

ఇరగవరం : తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రేలంగిలోని మంటలాంబను ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం బొలిశెట్టి అమ్మవారికి పూజలు చేశారు. పెంటపాడు, రేలంగి గ్రామ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న జన సైనికుడు



మోకాళ్ళపై మెట్లెక్కుతున్న చిన్న

పెంటపాడు, జూలై 14: మండలంలోని ఉమామహేశ్వరం గ్రామానికి చెందిన జన సైనికుడు మర్రిపూడి చిన్న తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేగా బొలిశెట్టి శ్రీనివాస్ విజయం సాధిస్తే గౌరీపట్నం మేరీ మాతను మోకాళ్లపై నడిచి దర్శించుకుంటానని మొక్కుకున్నాడు. ఈ మేరకు ఆదివారం జనసేన జెండా చేత పట్టుకుని మోకాళ్ళతో మెట్లెక్కి మేరీ మాతను దర్శించుకుని మొక్కు తీర్చుకున్నాడు.

500 మందికి వైద్య సేవలు



యలమంచిలిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

యలమంచిలి, 14 జూలై: స్థానిక కాపు కళ్యాణ మండపంలో పాలకొల్లుకు చెందిన టౌన్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ దుర్గా ప్రసాద్, గైనకాలజిస్టు లక్ష్మీ ప్రసన్న, ఎండీ కార్తీక్, ఆర్థోపెడిక్ డాక్టర్ నారిన శ్రీహర్ష 500 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ బి.మేరీ, ఎంపీటీసీ చిలుకూరి రాజ్యలక్ష్మీ, కె.ఫణి, సీహెచ్.నాగేశ్వరరావు, బి.హరి కిషోర్, ఆర్.బుజ్జివెలిచేటి వర్మ, తదితరులు పాల్గొన్నారు.

● తణుకు : సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం సంచార శకటం ద్వారా ఇంటింటికి వెళ్లి ఉచిత వైద్య సేవలు నిర్వహించారు. ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ తణుకు, వేల్పూరు ప్రాంతాల్లో పర్యటించి ఏడుగురు వృద్ధులకు వైద్య సేవలందించారు. డాక్టర్ కేవీ రావు ఇండియా నెట్ వర్క్ ఫౌండేషన్ ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. సంఘ కోశాధికారి ఎ.భాస్కరరావు, సభ్యుడు జి.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

భీమవరం టౌన్, జూలై 14 : మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ కలుగుతుందని ఏపీ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహం వార్డెన్ సీహెచ్ భానుమణి, ఎం.శ్యామల అన్నారు. వెనుకబడిన బాలికల వసతి గృహంలో శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ వసతి గృహంలో వివిధ రకాల 36 మొక్కలను నాటమని తెలిపారు. యు.రమేష్ నాయుడు, ఎ.సుబ్రహ్మణ్యం, ఎన్.కృష్ణ, ఎస్కే చాన్ భాషా, కె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై వ్యాస రచన పోటీలు

భీమవరం అర్బన్, జూలై 14: పర్యావరణ పరిక్షణపై ఉమ్మడి జిల్లాలోని పాఠశాల విద్యార్థులకు రచనల పోటీలు నిర్వహిస్తున్నామని భీమవరం బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ రచనలను బాలభాషిణి పుస్తకంలో ప్రచురించి, బహుమతులు అందజేస్తామన్నారు. రెండు పేజీలకు మించని రచనలు రాసి పాఠశాల హెచ్ఎంతో ధ్రువీకరించుకుని జూలై 30లోగా బాలోత్సవ కమిటీ గాంధీ కస్తూరిబా భవనం శ్రీరాంపురం, భీమవరం-2 అడ్రసుకు పోస్టు ద్వారా పంపాలన్నారు.

ఆధ్యాత్మిక పుస్తకాల పంపిణీ



ఆర్యవైశ్య సంఘ సభ్యులకు గ్రంథాలు బహుకరిస్తున్న దాతలు

పాలకోడేరు, జూలై 14: ప్రజల్లో ఆధ్యాత్మిక భావనలు పెంపొందించేందుకు సమాజంలో శాంతి నెలకొనేందుకు గ్రంథాలు పంపిణీ చేయడం అభినందనీయమని శృంగ వృక్షం ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు గ్రంధి రాజా అన్నారు. గ్రామంలో ఆదివారం కూర్మాల నారాయణ రావు, వెంకటేశ్వరమ్మ దంపతులు శ్రీవేదవ్యాస మహర్షి విరచిత కాశీ ఖండం గ్రంథాలను ఆర్యవైశ్య సంఘ సభ్యులకు బహూకరించారు. పూర్ణారావు, ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ, కోశాధికారి ఎ.వాసు, కె.మురళీ, కె.రాజు దాతలను అభినందించారు.

సామాజిక సేవల్లో ముందుండాలి



బిషప్ పరిదేశీ దంపతులను సత్కరిస్తున్న సుందర్ కుమార్

భీమవరం అర్బన్, జూలై 14: లూథరన్ సంఘాల సభ్యులు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని బిషప్ కె.పరదేశీబాబు పిలుపునిచ్చారు. బేతని చర్చిలో ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ చర్చ్ అధ్యక్షుడు పరదేశీ బాబు దంపతులను ఆదివారం సంఘ సభ్యులు సత్కరించారు. దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్‌కుమార్, డి.వర్గీస్ డానియేల్, డాక్టర్ పి.దేవరాజ్, పీడీ విల్సన్, ఎస్.పుష్పరాజ్, పి.సుదర్శన్‌కుమార్, పీజే కెనడీ, పాక రతన్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు ప్రారంభం

గణపవరం, జూలై 14: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు వాతావరణంలో పెనుమార్పుల ఫలితంగా గ్రామాల్లో పారిశుధ్య సమస్య తీవ్ర రూపం దాలుస్తుంది. మురుగునీటి పారుదల సౌకర్యంలేక పోవడంతో రహదారులపై మురుగునీరు తాండవిస్తున్నాయి. దోమలు విజృంభించే పరిస్థితి ఉండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీలు పారిశుధ్య సమస్యలపై దృష్టి సారించలేదు. కూటమి ప్రభుత్వం రావడంతో పంచాయతీలన్నీ పారిశుధ్యంపై దృష్టి సారించాయి. కచ్చా డ్రెయినేజీల మరమ్మతులకు పంచాయతీలు నడుం బిగించి పనులు ప్రారంభించాయి. మండలంలోని సరిపల్లె, కొత్తపల్లి, గణపవరం, ఎస్.కొండేపాడు, జల్లికొమ్మర, వల్లూరు, ఎ.గోపవరం తదితర గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

చెట్టు తొలగింపు



తాడేపల్లిగూడెం రూర ల్, జూలై 14: తాడేపల్లిగూడెంలోని ఆర్టీసీ బసాండ్ వద్ద వర్షాలకు కూలిన చెట్టు ప్రమా దకరంగా మారడంతో మున్సిపల్ అధికారులు ఆదివారం తొలగించారు. వర్షాలకు ఈ చెట్టు రోడ్డున వెళ్లేవారిపై పడుతుందని ప్రయాణికులు రెండు రోజులుగా ఆందోళన చెందారు. దీనిని తొలగించడంతో ఊపిరి పీల్చుకున్నారు.